క్లుప్తంగా

కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లుతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయితీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయితీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

వైఎస్సార్ సీపీ సమీక్ష సమావేశం నేడు

పర్చూరు(చినగంజాం): వైఎస్సార్ సీపీ జిల్లా సమీక్ష సమావేశం సోమవారం రథం బజార్‌లోని జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పర్చూరు పార్టీ కార్యాలయం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్ష సమావేశం వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి పర్చూరు ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి కూడా హాజరు కానున్నట్లు తెలిపారు. పర్చూరు నియోజక వర్గ పరిధిలోని ఆరు మండలాల సమన్వయ కర్తలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందుకుంటున్న కార్మికులతో కారంచేటి శివరామకృష్ణ

వేటపాలెం: రైల్వేస్టేషన్ రోడ్డులో గల కారంచేటి బిల్డింగ్స్‌లో కారంచేటి శివరామకృష్ణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి కారణం పార్యశుద్ధ్య కార్మికులే అన్నారు. వీధుల్లో చెత్తచెదారం లేకుండా పరిశుభ్రం చేయడం వల్లనే ప్రజలు సుఖసంతోషాలతో ఉంటున్నారని గుర్తుంచుకోవాలన్నారు. బందారు హెమంత్‌కుమార్, ప్రత్తి వెంకట సుబ్బారావు, పోలకం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు



బల్లికురవలో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

బల్లికురవ: మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై వై. నాగరాజు హెచ్చరించారు. ఆదివారం రాత్రి బల్లికురవ - అద్దంకి రోడ్ లో బ్రీత్ అనలైజర్‌తో పలువురు వాహనదారులకు పరీక్షలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని.. కారు సీటు బెల్ట్ ధరించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో బయలుదేరిన దగ్గర నుంచి ట్రాఫిక్ నిబంధనలు భద్రతా చర్య లు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరాలని కోరారు.


వైభవంగా దుర్గమ్మ నగరోత్సవం



మహిషాసుర వధ నృత్య ప్రదర్శన

ఒంగోలు మెట్రో: ఒంగోలు మర్రిచెట్ల కాలనీ పొలిమేర అభయాంజనేయ స్వామి వారి వీధిలో మర్రిచెట్ల కాలనీ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22 నుంచి శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక భక్తుల సహాయ సహకారాలతో దుర్గమ్మ మండపాన్ని ఏర్పాటు చేసి ప్రతిరోజు అమ్మవారి అలంకరణలు విశేష కుంకుమ పూజలు, పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఉంచి బాజాభజంత్రీలతో నగరోత్సవం నిర్వహించారు. అమ్మవారి వేషధారణలో పాల్గొన్న మహిళలు నృత్యాలు చేశారు.

చీమకుర్తిలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకలు



మాట్లాడుతున్న డాక్టర్ జవహర్

చీమకుర్తి: ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం చీమకుర్తిలోని పద్మశాలీయుల కల్యాణ మండపంలో శతాబ్ది వేడుకల కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ ముఖ్య అతిథిగా హాజరై ఆర్‌ఎస్‌ఎస్ ప్రాధాన్యతను వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుదారులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.



కంకర లేచిన అంబడిపూడి - ఇసుక దర్శి లింక్ రోడ్డు



తాత్కాలిక మరమ్మతుల్లో మార్టూరు రోడ్డు



కొణిదన - ఉప్పుమాగులూరు రోడ్డు ఇలా..

ప్రయాణం నరకమయం

- రాకపోకలకు ఇబ్బందులు
- గోతులు, కంకరలేచి దుమ్ముతో సాగని ప్రయాణం
- పట్టించుకోని ప్రభుత్వం
- మార్టూరు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులతో సరి



జారుడుబల్లను తలపిస్తున్న చెన్నుపల్లి- అనంతవరం రోడ్డు

బల్లికురవ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు పూర్తయింది. అధికారం చేపట్టగానే సంక్రాంతి పండగ లోపు రోడ్లన్నీ అభివృద్ధితో రాకపోకలకు ఇబ్బందులు తొలగిస్తామని ప్రకటించారు. అయితే నేటికీ గోతులు కంకరలేచి, దుమ్ముతో ప్రయాణం సాగక ప్రజలు అనారోగ్యం బారిన పడుతూ వైద్యానికి లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇటీవల నక్క బొక్కల పాడు గ్రామంలో నిరసనతో పాటు గ్రానైట్ లారీల రాకపోకలు నిషేధిస్తున్నట్లు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

అధ్వాన స్థితికి చేరిన రోడ్లు ఇవే..

బల్లికురవ - నాగరాజు పల్లి- మార్టూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో బల్లికురవ -నాగరాజు పల్లి గ్రామాల మధ్య ఆరు కిలోమీటర్లు అధ్వానంగా ఉంది. మోకాటి లోతు గోతులతో తరచూ వాహనాలు గోతుల్లో కూరుకుపోయి ట్రాఫిక్ జామ్ అవుతోంది. చెన్నుపల్లి- అనంతవరం ఆర్‌అండ్‌బీ రోడ్డును కొండాయపాలెం - మల్లయపాలెం గ్రామాల మధ్య గ్రానైట్ నిర్వాహకులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తారు రోడ్డు, మట్టి రోడ్డుగా మారి జారుడు బల్లను తలపిస్తోంది. ఇదే రోడ్డు మల్లయపాలెం - వేమవరం - తాతపూడి మధ్య గ్రానైట్ దుమ్ము ప్రభావంతో బైక్‌లపై వెళ్లే పరిస్థితి లేదు. కొణిదెన- వేమవరం జంక్షన్- ఉప్పుమాగులూరు లింకు రోడ్డుకు మోకాటిలోటు గోతులు ఏర్పడ్డాయి. అంబడిపూడి- ఇసుక దర్శి లింక్ రోడ్డు తారు లేకపోవడంతో మెటల్ లేచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రామాంజనేయ పురం- ముక్తేశ్వరం - గుంటుపల్లి లింకు రోడ్డు అధ్వాన స్థితిలోనే ఉంది.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన ప్రజలు

బల్లికురవ - మార్టూరు రోడ్లో నక్క బొక్కల పాడు గ్రామం ఎస్సీ కాలనీ వద్ద ఏర్పడిన గోతులు దుమ్ము ప్రభావంతో అనారోగ్యం బారిన పడుతున్నామంటూ ఇటీవల గ్రానైట్ లారీలు రాకపోకలను నిషేధిస్తూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామం నుంచి కొంత భాగం ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

> **పూర్తిస్థాయిలో రోడ్లను అభివృద్ధి పరచండి**
>
> 
>
> 90 నుంచి120 టన్నుల భారీ గ్రానైట్ లారీలు ఈర్లకొండ క్వారీల నుంచి ప్రతిరోజూ బల్లికురవ - మార్టూరు, బల్లికురవ - సంతమాగులూరు, చెన్నుపల్లి- అనంతవరం, బల్లికురవ - కొమ్మాలపాడు, బల్లికురవ - అద్దంకి రోడ్ల ద్వారా హైవేల్లో కలుస్తుంటాయి. హైవేలు పటిష్టపరిచినట్లుగానే పూర్తిస్థాయిలో గ్రామీణ రోడ్లను కూడా అభివృద్ధి చేయాలి.
>
> – దేవినేని కృష్ణ బాబు
> (వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్)



అధ్వాన స్థితికి చేరిన బల్లికురవ - మార్టూరు రోడ్డు



నక్క బొక్కల పాడులో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన ప్రజలు,



దుమ్ము లేస్తున్న రోడ్డు

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

చీరాల టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ సూచించారు. ఆదివారం ఈపురుపాలెంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గాంధీపార్కు, సావరపాలెం, 40 ఇండ్ల కాలనీ, పద్మనాభునిపేట, సీతారాంపేట, ఇందిరానగర్ కాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ఈసందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డస్ట్ బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వచేసి పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలను అందించాలన్నారు. జనావాసాల మధ్య చెత్త కుప్పలను నిల్వ చేయకూడదన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రజలంతా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

వైభవంగా వాసవీ మాత గ్రామోత్సవం



గ్రామోత్సవంలో వాసవీ కన్యకారమేశ్వరి

వేటపాలెం: విజయదశమి పర్వదినం సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థా నం కమిటీ ఆధ్వర్యంలో వసవీ కన్యకాపరమేశ్వరి దసరా గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారి పుట్టింటివారు గొడవర్తి శ్రీధర్, సుధారాణి దంపతుల అమ్మవారికి పసుపు కుంకుమలు ఊరేగింపుగా ఆలయానికి తీసుకొన్ని ప్రత్యేక పూజల అనంతరం అమ్మ వారికి సమర్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అందంగా అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాలతో, తీర్మార్ డప్పులతో విద్యుత్ దీప కాంతులతో, బాణసంచాలతో విచిత్ర వేషధారణలతో ఆలయం నుంచి పుర వీధుల్లో ఊరేగింపుగా బయలు దేరి ఆదివారం ఉదయం ఆలయం వద్దకు ఊరేగింపు చేరుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రతి ముత్తుకుమరన్, శీరం గోవర్ధన రావు, ఆలకు ప్రసాదరావు పాల్గొన్నారు.

అమ్మవారికి కాసులపేరు బహూకరణ



కాసులపేరుతో కనక నాగవరపమ్మ



కాసులపేరును ఈఓకి అందజేస్తున్న దాత

వేటపాలెం: రామన్నపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్ప వల్లి కనక నాగవరపమ్మ అమ్మవారికి రూ. 32,500 విలువగల కాలసుల పేరు ఆదివారం దాత బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పోతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ సంతరావూరు గ్రామానికి చెందిన పమిడి నాగరాజు, విజయలక్ష్మి దంపతులు 500 గ్రాముల గల వెండి మీద గోల్డ్ కోటింగ్‌తో గల కాసుల పేరు అమ్మవారి అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా దాతలు ఆలయంలో అమ్మ వారికి మొక్కులు తీర్చుకొని పూజలు చేశారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాల అర్బన్: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జోన్ సోషల్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్‌అండ్ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో ఎన్నారై దాతల సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో శంకర్ కంటి హాస్పిటల్ వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించారు. కంటికి సంబంధించిన శుక్లాలు, ఇతర శస్త్రచికిత్స అవసరమైనవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో తమవంతు బాధ్యతగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఎప్పుడు ముందుంటుందన్నారు. శిబిరంలో 500 మంది రోగులు పాల్గొనగా 60 మందికి శస్త్రచికిత్స అవసరమున్నట్లుగా గుర్తించారు. మొదటి విడతగా 30 మందికి శస్త్రచికిత్స చేసేందుకు హాస్పిటల్‌కు తరలించామని, రెండో విడత ఈనెల 7న ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. వీబీవీ సత్యనారాయణ, జోన్ అబ్జర్వర్‌గా మారుటూరి రాఘవేంద్రరావు, గుగ్గిలం లలితకుమారి, అచ్యుత శ్రీనివాసరావు, క్లబ్ జోన్ ఛైర్మన్ వల్లంపట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో చింతలపూడి



మేదరమెట్లలో పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, దైవాలరావూరు గ్రామాల్లో ఆదివారం పలు కార్యక్రమాల్లో అద్దంకి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగి అల్లడి సుబ్బారావు పదవీవిరమణ కార్యక్రమంలో పాల్గొని సుబ్బారావు దంపతులను శాలువాలతో, పూలమాలలతో సన్మానించారు. దైవాలరావూరులో నరేష్, మహాలక్ష్మి నూతన వధూవరులను ఆశీర్వదించారు. పదవీబాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సారిగా వచ్చిన ఆయన్ను మేదరమెట్లలో పార్టీ కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు.

నేడు పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని కేశవరప్పాడు అగ్రహారం గ్రామంలో గ్రామ దేవత నూతన పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం జరగనున్నట్లు కమిటీ వారు తెలియజేశారు. నిత్య పూజా విధి విధానాలతో పాటు పూజా హారతి, మంత్ర పుష్పం తీర్థ ప్రసాద వినియోగం జరుగుతాయని ప్రతిష్ఠ యాగ్నికులు కారంచేటి దక్షిణామూర్తి తెలియజేశారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సాహితీ కౌముది బాధ్యులు

అద్దంకి: సాహితీ కౌముది ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పుట్టంరాజు కళా క్షేత్రంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి కుందా సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సభకు చప్పిడి వీరయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ బాపట్ల జిల్లా కార్యదర్శి కరి కమలేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో మోపర్తి వెంకట వెంకటరావు, సీతారామశాస్త్రి, తేలప్రోలు క్రిష్టయ్య, కారసాని అంజిరెడ్డి, మారం కోటేశ్వరరావుకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. శింగరకొండ దేవస్థాన ట్రస్‌బోర్డు చైర్మన్ చుండూరి మురళీ సుధాకర్‌రావు, డాక్టర్ యు. దేవపాలన, వారణాశి రఘురామశర్మ, నిమ్మరాజు నాగేశ్వరరావు, కూరపాటి రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అంకమ్మతల్లి మూలవిరాట్



శాంతి హోమాలు నిర్వహిస్తున్న అర్చక బృందం

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో ఉన్న శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద వెలసి ఉన్న శ్రీ అంకమ్మతల్లి ఆలయ అనంత వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు, నారాయణం జయత్రినాథ్, నారాయణం నాగతేజేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, మహాశాంతి యాగం, శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పాలపొంగళ్లు నివేదించి చీర, సారె, పూలు, పండ్లు, పసుపుకుంకుమలను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తీరంలో సండే సందడి



సముద్రంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్ర తీరం సందడి నెలకొంది. ఆదివారం కావడంతో చీరాల, పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని నర్సరావుపేట, చిలకలూరిపేట నియోజక వర్గాల్లోని గ్రామాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధికసంఖ్యలో వాడరేవుకు చేరుకున్నారు. తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామికి, గ్రామంలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సివిల్, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీరాల అర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం రామకృష్ణాపురం, హస్తినాపురం, సాల్మన్‌సెంటర్, నవాబుపేట, రామిరెడ్డినగర్, సిపాయిపేట తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డి2 సెక్షన్ ఏఈ బి.శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలానే కొత్తపేట సబ్‌స్టేషన్‌లో 11 కేవీ వాడరేవు ఫీడర్ కింద మరమ్మతుల నేపథ్యంలో సోమవారం వాడరేవు, పెర్లవారిపాలెం, బుర్లవారిపాలెం, కీర్తివారిపాలెం, పాపాయిపాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ తెలిపారు.

నేడు మార్టూరులో కంటి వైద్య శిబిరం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో సోమవారం ఉదయం 9 గంల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జాతీయ రహదారి పక్కన గల విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరంలో ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డులు ఉన్నవారికి అన్ని రకాల కంటి పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. నరసరావుపేటకు చెందిన డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వైద్యుల ఆధ్వర్యంలో మార్టూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్వాహించనున్న వైద్య శిబిరంలో కంటి శుక్లం శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచిత రవాణా సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. మార్టూరు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

టీడీపీ రియల్ ఎస్టేట్ మాఫియా అసత్య ఆరోపణలు

- దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్: పేర్నమిట్ట సర్వే నంబర్ 148/2లో సుదర్శనానికి ఎటువంటి హక్కులు లేవని, ఈ అసత్య ఆరోపణల వెనుక టీడీపీ రియల్ ఎస్టేట్ మాఫియా ఉందని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. ఒంగోలు ఎంసీఏ భవన్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేర్నమిట్ట సర్వే నంబర్ 148/2లోని ఎకరా 4 సెంట్ల రిజిస్టర్ భూమి తమదేనన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ దివాకరరెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారన్నారు. చివుకుల గోపాలకృష్ణయ్యకు చివుకుల సుదర్శనంకు ఎటువంటి సంబంధం లేదన్నారు. పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తీసుకున్నవి సర్టిఫైడ్ కాపీలేగానీ, అసలు డాక్యుమెంట్లుగానీ, లింక్ డాక్యుమెంట్లుగానీ కాదన్నారు. అనవసరమైన వివాదాలు సృష్టించి లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. లింగారెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి తన తాత నీలం రోశయ్య ఎకరా 80 సెంట్లను 1905లో కొనుగోలు చేశారన్నారు. 1930లో సివిల్ దావాలో తమ భూమి వేలానికి వచ్చిందని, అయితే ఆ వేలం అమలు కాలేదని తెలిపారు. మాల కులస్తుడైన తమ తాత నీలం రోశయ్యకు పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి ఎలా వారసుడవుతాడని నీలం నాగేంద్రరావు ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో దారా అంజయ్య, కాకుమాను రవి, నాసరయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com